


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 13 సంచిక : 10 జూన్ 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


విజయవాడ ......... 29-02-08

చించినాడ ........... 06-03-08



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 29-02-08, విజయవాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనో దేహములతో సంబంధం లేకుండా ఒక సద్వస్తువు మన హృదయంలో ఉంది. దానికి చావు పుట్టుకలు ఎలా ఉంటాయో తెలియదు. సూర్యుడు ఏవిధంగా అయితే చీకటిని చూడలేడో అలాగే మన హృదయంలో ఉన్న సద్వస్తువుకు అశాంతి ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో తెలియదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. పాండిత్యం జ్ఞానం కాదు, ధనం జ్ఞానం కాదు, మీకు ఉన్న గౌరవాలు జ్ఞానంకాదు, ఇవి అన్నీ బయట గొడవలు. ఇవి ఏమీ జ్ఞానం కాదు. ఈ బయట గొడవల వలన మీకు ఉన్న దేహబుద్ధి నశించదు. ఎంతకాలం అయితే మీకు దేహబుద్ధి నశించదో అంతకాలం మీకు ఆత్మబుద్ధి కలుగదు. ఆత్మబుద్ధి కలిగేవరకూ మనం ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. మనిషి కూడా నీడ వచ్చినట్లుగా దేహబుద్ధి ఉన్నంత కాలం మీరు ఏ దేహం ధరించినా మిమ్మల్ని దుఃఖం, అశాంతి విడిచి పెట్టవు.

అజ్ఞానం పోగొట్టుకోండి అని సబ్జక్టు చెపుతూ ఉంటే ఎవరూ పట్టించుకోరు, ఎవరూ గౌరవించరు. ఎందుచేతనంటే దాని విలువ వారికి తెలియటంలేదు, సబ్జక్టు వదిలేసి ఈ యాగం చేయండి, ఈ యజ్ఞం చేయండి మీ కోరికలు నెరవేరతాయి అంటే అందరూ మీ కూడా పడతారు. మనకు ఏది మంచిదో మనకు తెలియటం లేదు. నేను ఉన్నాను, నేను ఉన్నాను అంటే దుఃఖం లేని స్థితికి వెళ్ళలేము. ఏదైతే ఉందో అదే నేను అని నీకు తెలియాలి. ఆ అద్వైతానుభవం నీకు కలిగేవరకూ ఏ మనిషినీ వాడు ఎంత ధనవంతుడైనా, ఎంత

పండితుడైనా దుఃఖం విడిచిపెట్టదు. ఇప్పుడు మనం కొన్ని సుఖాలు అనుభవిస్తున్నాము కదా. అవి సుఖాలు కాదు. అవన్నీ దుఃఖమిశ్రితాలే. బయటనుండి ఏ సుఖాలు వచ్చినా భవిష్యత్‌లో అవి రెట్టింపుకు రెట్టింపు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. నిప్ప మీద చెయ్యి వేస్తే అది మీకు తెలిసినా, తెలియక పోయినా చెయ్యిని కాలుస్తుంది. అది నిప్ప యొక్క స్వభావం. మీకు తెలిసి ఎరుకతోటి హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళినా, మీకు తెలియకుండా అక్కడకు వెళ్ళినా హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళేసరికి దాని తాలుక సుఖం, శాంతితోటి మీ సహస్రారం నిండిపోతుంది. ఆ స్థితిలో ఉండి మీకు ఎవరైనా మాట చెపితే దాని ద్వారా మీకు ఆనందం అందుతుంది కాని కేవలము పాండిత్యం వలన అందేది కాదు. పాండిత్యం యొక్క ప్రయోజనం ఉంది, ధనం యొక్క ప్రయోజనం ఉంది. ఇవన్నీ కంప్లీట్‌గా అవుట్‌సైడ్ గొడవలు. అవన్నీ మనస్సుతో ఎక్వయిర్ చేసుకొనేవి. ఇది అలా కాదు. మనస్సు దాని యొక్క మూలంలోనికి వెళితే ఇది తెలుస్తుంది.

మానవజాతిని దుఃఖం లేని స్థితికి తీసుకొని వెళ్ళటానికే మహాత్ములు అందరూ ప్రయత్నం చేసారు. దుఃఖం లేని స్థితికి తీసుకొని వెళ్ళటమేకాదు, ఆనందసాగరంలో ఊగిసలాడాలి. అది బాహ్యపరిస్థితుల వలన రాదు. టెక్నాలజీ మనకు కొన్ని సదుపాయాలు తీసుకొని వచ్చింది. నిజంగా మన సుఖం సదుపాయాల మీద ఆధారపడి ఉంటే సుఖం పెరిగిపోవాలి. ఇప్పడు కార్లు వచ్చాయి, విమానాలు వచ్చాయి, మరి మీరందరూ సుఖంగా ఉన్నారా? నూటికి నూరుపాళ్ళు ఆనందంగా ఉన్నామని మీలో ఎవరైనా చెప్పగలరా? లేదు. బాహ్య గొడవలలో సుఖం అనేది లేదు. పూర్వం పంచెలు కట్టుకొని, స్కూలులో చదువుకోకుండా, ఎక్కడికైనా వెళ్ళాలంటే నడిచి వెళుతూ మనకంటే ఎక్కువ సుఖంగా జీవించారు. ఇప్పడు మనం విమానాలలో తిరుగుతూ దుఃఖపడుతున్నాము. సుఖం అనేది కారులలో, విమానాలలో లేదు. సుఖం అనేది బయట లేదు. నీ లోపలే ఉంది. సుఖం అనేది ఎక్కడైతే ఉందో అక్కడ వెతికితే ఈనాడు కాకపోయినా, ముందునాటికైనా అది నీకు లభ్యమవుతుంది. పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఉండాలి. అలాగే నీ లోపల ఉన్న సత్య వస్తువును చేరుకోవాలంటే నీకు అభ్యాసం, వైరాగ్యం అవసరమని పరమాత్మ చెప్పాడు.

ఏ శాస్త్రం చదివినా, భగవద్గీత చదివినా, బైబిలు చదివినా నువ్వు ఆత్మవు అని చెపుతున్నారు, చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో తెలియని ఆత్మవు అని రిపీటెడ్‌గా చెపుతున్నారు. నిజంగా నేనే కనుక ఆత్మను అయితే నాకు దుఃఖం ఎందుకు వస్తోంది, నాకు అశాంతి ఎందుకు వస్తోంది అని అడుగుతున్నారు. దీనికి

ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే రోగాలు శరీరంలో ఉంటాయి. రాగద్వేషాలు, కోపాలు, ఇష్టాలు, బాధలు అన్నీ మనస్సులో ఉంటాయి. కోపం శరీరానికి రాదు, కోపం మనస్సుకు వస్తుంది. తరువాత అది శరీరంపై పడుతుంది. మీకు కోపం వచ్చింది అనుకోండి, దానిని దాచుకొందాము అనుకొన్నా అది మీ కళ్ళలో తెలిసిపోతుంది. మీ మనస్సులో వచ్చే ప్రతీ వికారము శరీరంలోనికి వచ్చేస్తూ ఉంటుంది. మైండ్ యొక్క స్థూల భాగమే శరీరం. ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే నువ్వు దేహం అనుకొన్నప్పుడు ఆత్మవే, నువ్వు మనస్సు అనుకొన్నప్పుడు ఆత్మవే. అయితే నువ్వు ఏమనుకొంటున్నావు దేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు, మనస్సును ఆత్మ అనుకొంటున్నావు. అందుచేత దేహము చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. దుఃఖం మనస్సులో వస్తుంది. మనస్సును ఆత్మ అనుకొంటున్నావు కాబట్టి నాకు దుఃఖం వస్తోంది అంటున్నావు అంటే శరీర ధర్మాలను, మనస్సు ధర్మాలను ఆత్మ మీద ఆరోపించుకొంటున్నావు. నువ్వు కాని మనస్సును, నువ్వు కాని దేహాన్ని నువ్వు అనుకొంటున్నావు. ఇదంతా మిధ్యా జ్ఞానం. ఇదంతా నాన్‌సెన్స్. మిధ్యాజ్ఞానంలో మనిషి ఉన్నప్పుడు వాడు ధనవంతుడైనా, పండితుడైనా, మీకు అధికారం ఉన్నా, ఎన్నో మహిమలు చేయగల సమర్థత ఉన్నా నువ్వు అశాంతిలో నుండి, దుఃఖంలో నుండి విడుదల పొందలేవు. అది ఆచార్యులవారి ఉవాచ. ఈ మాటలు మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మిమ్మల్ని నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళే ప్రయత్నం ఇది. ఎందుచేతనంటే నీ హృదయంలో ఉన్న నిజం దగ్గరకు నీవు చేరుకొనే వరకు నీకు ఫ్రీడమ్ లేదు, నీకు శాంతి లేదు.

ఈ లోకం అంతా దుఃఖాలయం. ఎవరింటికి వెళ్ళినా ఏడుపే. కోరిక నెరవేరితే గర్వం, నెరవేరకపోతే ఏడుపు. ఎలాగైనా పాడైపోతున్నారు. కోరిక లేకుండా చూసుకొందాము అనే బుద్ధి ఎవరికీ కలగటం లేదు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యటమే అభ్యాసము. మరి వైరాగ్యం ఎందుకు? అభ్యాసం చేద్దామని కూర్చొనేటప్పటికి బ్యాంక్ ఎక్కౌంట్ జ్ఞాపకం వస్తుంది. వెంకటేశ్వరస్వామి సమక్షంలో కూర్చొని ఇంట్లో గొడవలు తలపెట్టుకోవటం. అవుట్‌సైడ్ గొడవలమీద మనకు వైరాగ్యం లేదు. వైరాగ్యం లేకపోతే నీకు ఆత్మాన్వేషణ సాధ్యం కాదు. మన శరీరం ఎక్కడైతే ఉందో మనస్సు అక్కడ ఉండటం లేదు. దీనికి వైరాగ్యం లేకపోవటం కారణం. నేను సత్యాన్వేషణ చేస్తున్నాను, మనస్సును నియమించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను అని నువ్వు అనుకొన్నప్పటికి బాహ్యంగా నీకు ఆకర్షణలు ఉన్నంతకాలం, మమకారం ఉన్నంతకాలం నీవు ఏమీ సాధించలేవు. నీకు పేకాట అంటే ఇష్టం అనుకో, విచారణ చేద్దాము అని ఇక్కడ కూర్చొన్నా మనస్సులోపలకు వెళ్ళదు, పేకాట మీదకు పోతుంది. కొంతమంది

జంతువులను వేటాడుతూ ఉంటారు, అదికూడా ఒక వ్యసనం. తిట్టే నోరుకూడా వ్యసనమే. స్త్రీలోలత్వం అంటే స్త్రీ పురుషుల మధ్య దేహానికి సంబంధించిన ఆకర్షణ ఎక్కువగా ఉన్నా నువ్వు విచారణ చెయ్యలేవు. మద్యపానం కూడా వ్యసనమే. కీర్తి కాంక్ష మరీ వరస్ట్. కొంతమందికి ఎంతసేపు పేరు గొడవే. తల్లి కడుపులో నుండి ఒక శవం వచ్చింది, వ్యవహారం కోసం దానికి ఒక పేరు పెట్టారు. ఆ పేరు కల్పితం. అదే నేను అనుకోవటం, గోడమీద ఆ పేరు వ్రాస్తేగాని పది రూపాయలు చందా కూడా ఇవ్వడు. ఎవరైనా పచ్చగా ఉంటే కొంతమంది సహించలేరు, అసూయ వచ్చేస్తుంది. ఎదుటివారు బాగుంటే మనకు వచ్చే నష్టం ఏమీ లేదు కాని అసూయ పడతారు, అది ఒక బలహీనత.

బయట గొడవలమీద ఆకర్షణ తగ్గించుకోకపోతే నువ్వు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేసినా అది ఫలించదు, పరీక్ష వ్రాస్తావు కాని మార్కులు సున్న. ఫండమెంటల్‌గా వైరాగ్యం ఉండాలి. రోడ్డు మీద చూసిన ప్రతీ గడ్డిపరక నాకే కావాలి అనుకొనే వాడికి ఇంక అభ్యాసం ఏమిటి? మనం ఒక పని చేస్తే ఒకరికి ఎక్కువ వస్తుంది, ఒకరికి తక్కువ వస్తుంది. దానిని భగవంతుడి ప్రసాదంగా తీసుకోవాలి. ఫలితం మన ప్రారబ్ధాన్నిబట్టి వస్తుంది. మనకు అంతవరకే అర్హత ఉంది అనుకోవటం మానేసి భగవంతుడిని తిట్టటం, కనిపించినవాడినల్లా తిట్టటం. అంటే ఉన్న దానితో సంతృప్తి పడలేకపోతున్నాము. అజ్ఞానాన్ని పోగొట్టుకోండి, బంధంలో నుండి బయటకు రండి అని చెపితే మనకూడా ఎవరు వస్తారు, ఎవరు డబ్బు ఇస్తారు. ఈ యజ్ఞం చేయండి మీ కోరికలు నెరవేరతాయి అంటే డబ్బు ఇస్తారు, అందుచేత ఈ బిజినెస్ బాగుంటుంది అనుకొంటున్నారు. మీకు ఉన్న అవిద్యను పోగొట్టుకోండి అంటే సమాజంలో ఆ మాటకు ఆకర్షణ ఏముంటుంది. నిద్రలో మనం అందరం హ్యాపీగా ఉన్నాము. తాటాకు ఇంట్లో ఉన్నవాడు నిద్రలో నేను తాటాకు ఇంట్లో ఉన్నాను అనుకోడు, మేడలో ఉన్నవాడు నేను మేడలో ఉన్నానని అనుకోడు నిద్రలో, వాడు ఎంత ఆనందంగా ఉన్నాడో వీడూ అంతే ఆనందంగా ఉన్నాడు. ఎందుచేతనంటే నిద్రలో మనం మన నిజమైన ఇంటికి వెళ్ళిపోతున్నాము. ఎక్కడైతే భగవంతుడు నేను ఉన్నాను అని చెపుతున్నాడో అక్కడికి వెళ్ళిపోతున్నాము. అక్కడ ఏ గొడవ లేదు మీరు ఉన్నారు. నిద్రలో నేను లేను అని ఎవరూ చెప్పటం లేదు. మెలుకువ రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు అన్నీ వస్తాయి. నేను అనే తలంపు వచ్చాక లోకం వస్తుంది, దేవుడు వస్తాడు. నేను అనే మూలతలంపు నీ లోపలనుండే వస్తోంది. నేను అనేది నిజమే కాని నేను అనే తలంపు నిజం కాదు. ఆ మూలతలంపును అభ్యాస వైరాగ్యముల ద్వారా దాని

మూలంలోనికి పంపితే అది నశిస్తుంది, అప్పుడు నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది, అదే నిర్వాణస్థితి, అదే స్వర్గరాజ్యం. అప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే.

పొయ్యిలో పిడకలు, కట్టెలు, పుల్లలు వేస్తూ ఉంటే అవి అన్నీ ఎలా భస్మం అయిపోతాయో అలాగే జ్ఞానాగ్నిలో మనం చేసిన కర్మలు అన్నీ అవి మంచికర్మలు అయినా, చెడు కర్మలు అయినా దగ్ధమయిపోతాయి, అట్టి ఆత్మజ్ఞానం వైపుకు కళ్ళు తెరువు, అక్కడికి మేలుకో అంటున్నాడు పరమాత్మ. ఏదైతే సత్యపదార్థమో దాని గురించి విసుగు వచ్చేలా వినండి, విన్నదానిని మనస్సులో తిప్పకోవాలి. మనం ఏదైతే చింతిస్తూ ఉంటామో అదే అవుతాము. విషయాలను చింతిస్తూ ఆత్మలాభం పొందాలంటే పొందలేము, ఆత్మను చింతిస్తూ ఉంటే ఆత్మలాభం పొందుతాము. చమత్కారాల వలన, కుయుక్తుల వలన జీవలక్షణాలు నశించవు, మనస్సు నశించదు, వ్యసనాలు తొందరగా విడిచిపెట్టవు. అవి ఎంత లోతుగా ఉన్నాయో, అంత కష్టపడి సాధన చేసి వాటిని బయటకు లాగితేనేగాని అవి బయటకు పోవు. మన కంట్రోలర్ ఎక్కడో దూరాన లేడు. మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. దేహప్రారబ్ధాన్ని అనుసరించి మనలను ఆడిస్తున్నాడు. వాడు మనలాగ పనిచేయటంలేదు, సైలెంట్‌గా పనిచేస్తున్నాడు ఆయన ఎంత సైలెంట్‌గా పనిచేస్తున్నాడో, మనం చేసేపని కూడా అంత సైలెంట్‌గా చేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము. మనకు పని అక్కరలేదు, ఎడ్వర్‌టైజ్‌మెంట్ కావాలి. ఎవరో చేసిన మంచిపని కూడా మనమే చేసాము అని చెప్పకొంటాము, అంత దిగజారిపోయాము. వ్యసనాలు అన్నీ మనకు దుఃఖకారణాలే. వాటిలో నుండి విడుదలపొందటం చాలా కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా చిన్న అలవాటులో నుండి కూడా బయటకు రాలేము. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు కదా. అందరి హృదయాలలో ఉన్నవాడు నా హృదయంలో కూడా ఉండాలి కదా అయితే మరి నాకు ఎందుకు కనిపించటం లేదు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నీ రాంగ్‌తింకింగ్‌లో నుండి, రాంగ్ హేబిట్స్‌లో నుండి ముందు బయటకు రా అప్పడు భగవంతుడు ఉన్నాడో లేడో నీకు తెలుస్తుంది. అది అనుభవైక వేద్యం. అది నీ ఇంద్రియాలకు అందకపోవచ్చు, నీ మనస్సుకు అందకపోవచ్చు, నీ బుద్ధికి గోచరించకపోవచ్చు, వాడు అనుభవైకవేద్యం, అనుభవానికి అందుతాడు. నీ వాండరింగ్ మైండ్‌లో నుండి బయటకు వచ్చి చూడు, అప్పడు ఉన్నాడో లేడో నీకే తెలుస్తుంది. సాక్ష్యాలతో పనిలేదు అని చెప్పారు.

కామక్రోధములనుండి బయటకు రాలేకపోతున్నాను అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. కామక్రోధములకు అసలు బలం అంటూ లేదు. వాటి గురించి నువ్వు

చింతిస్తున్నావు. నువ్వు చింతించేకొలది వాటికి బలం పెరిగిపోతుంది. ఈ నాన్‌సెన్స్ అంతా ద్వైతంలో నుండే వస్తోంది. నిజం అనేది రెండుగా లేదు, మూడుగా లేదు, నిజం అనేది ఏకంగానే ఉంది. నీ మనస్సును తీసుకొనివెళ్ళి హృదయంలో ఉన్న నిజంతో ఏకం చెయ్యి. లోపల ఉన్న సద్వస్తువుతో ఏకత్వం వచ్చాక నీకు ద్వైతం ఏమీ లేదు. మనం ఆత్మచింతన చేస్తున్నాము అని అనుకొంటున్నాము కాని మనం చేసేది విషయచింతన. చీమ ఎంత నెమ్మదిగా నడుస్తుందో అంత నెమ్మదిగా ప్రయాణం చేసినా ఫరవాలేదు గాని రైట్ డైరెక్షన్ విడిచిపెట్టవద్దు, గోల్‌ను మర్చిపోవద్దు. మద్రాసు వెళ్ళాలి అనుకొని కలకత్తా వెళ్ళే రైలులో కూర్చొంటే దానికి అర్ధం ఏమిటి? అనాత్మను చింతిస్తూ నాకు ఆత్మజ్ఞానం కావాలంటే ఎలా సాధ్యమవుతుంది. మనం ఏ వస్తువునైతే తెలుసుకోవాలి అనుకొంటున్నామో దాని తాలూక అనుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. మన హృదయంలో ఉన్న సద్వస్తువే అంతటావ్యాపించి ఉంది. అది వేరు ఇది వేరు కాదు. ఎప్పుడైతే నీకు దేహాభిమానం నశించిందో లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. అది అంతటా వ్యాపించి ఉంది కాబట్టి మనం కూడా అంతటా ఉన్నాము అనే అనుభవం నీకు కలుగుతుంది. అప్పుడు రాకపోకలతో పనిలేదు. అప్పుడు ఎటుచూసినా శాంతే.

నేను అనే తలంపు మనకు లోపల నుండే వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక ఇతరతలంపులు వస్తున్నాయి. నేను అనే తలంపు, దానికి వచ్చే ఇతరతలంపులు ఈ మూట అంతా కలిసి మనస్సు అంటున్నాము. మనస్సు వచ్చాక దేహం, దేహం వచ్చాక లోకం, లోకం వచ్చాక దానికి ఎవడో ఒక కర్త ఉండాలి కదా, అక్కడ నుండి దేవుడు వస్తున్నాడు. అందుచేత నీవు మూలతలంపు మూలంలోనికి వెళితే దేవుడు, లోకము, మనస్సు ఇవన్నీ కూడా లోపలకు విత్‌డ్రా అయిపోతాయి, అప్పుడు అంతటా ఉన్నది మీరే. ఈ దేవుడి కథ, లోకాల కథ, పుణ్యపాపాలు, కర్మలు ఇవన్నీ కూడా ఈ మూలతలంపు మీదే ఆధారపడి ఉన్నాయి. ఆ మూలతలంపును మీరు అనుకొంటున్నారు కాబట్టి దానిని డౌట్ చేయటం లేదు. ఆ మూలతలంపు మీరు అనుకొన్నంతకాలం దానిలోనుండి బయటకు రాలేరు. అది నేను కాదు అని ముందు మీకు అర్థమవ్వాలి. జ్ఞానం అంటే మిధ్యాజ్ఞానం కాదు. నువ్వు పుస్తకాలు చదివితే పాండిత్యం వస్తుంది, సన్మానాలు చేస్తారు, అక్కడితో సరి, మరణానంతర జీవితం సున్నా. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో, ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. ఒకే వాక్యం చెప్పాడు అంతే. ఎంత అందంగా చెప్పాడో చూడండి, బుద్ధి ఉన్నవారు అంతా ఆలోచించండి. కోరికలు పెట్టుకొని దేవతలను పూజించేవారికి కోరికలు నెరవేరవచ్చు,

ఆ దేవతలను పొందవచ్చు. నన్నే ఆరాధించేవాడు, నాకోసం జీవించేవాడు, నా సంతోషం కోసం పనిచేసేవాడు నా అనుగ్రహానికి పాత్రుడవుతాడు, నన్ను పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు. అక్కడ నన్ను అంటే ఆత్మని పొందుతాడు. నిరంతరం నన్ను స్మరించటమే ధ్యేయంగా పెట్టుకొన్నవాడు లౌకికకార్యాలు, వైదికకార్యాలు వదిలేసినా వాడిని పాపం అంటదు అని చెప్పాడు. అంటే మనలను ధర్మం విడిచిపెట్టేయమనికాదు.

మనం చేయరాని పనులు చేయకూడదు, చెయ్యవలసిన పనిని మానకూడదు. అంటే మనం చెయ్యకూడనిపని చేస్తే ఎంతదోషం వస్తుందో మనం చెయ్యవలసిన పని వదిలేసినా అంతే దోషం వస్తుంది. సత్యం నీ హృదయంలో ఉంటే సరిపోదు, అంతమాత్రంచేత దుఃఖం నశించదు. దాని తాలుక ఎరుక నీకు వచ్చినప్పడే దుఃఖరహితస్థితిని పొందగలవు. మనందరకు ఆస్తులు లేకపోయినా, అందరికి తలో ఒక శవం ఉంది. ఈ శవంతో ఏ భోగం అనుభవించినా తప్పనిసరిగా అది రోగం కింద వస్తుంది. పూర్వజన్మలో మనం అనుభవించిన భోగాలే ఇప్పడు రోగాల కింద వస్తున్నాయి. ఈ జన్మలో అనుభవించే భోగాలు రాబోయే జన్మలో రోగం కింద వస్తాయి. భోగం అనుభవించాడా వాడికి రోగం వచ్చి తీరుతుంది. ప్రతీ భోగం వెనకాల రోగం ఉంటుంది అది మనకు తెలియదు. భోగం బాగానే ఉంది అనుకొంటాము, దాని వెనకాల రోగం ఉంది అని మనకు తెలియటం లేదు. అది తెలియచెప్పేవాడే గురువు. పుణ్యలోకాలు ఉన్నాయా, చీకటిలోకాలు ఉన్నాయా, స్వర్గలోకం ఉందా అని భగవాన్‌ను అడిగితే ఆయన ఉన్నాయనీ చెప్పలేదు, లేవు అని చెప్పలేదు. ఆయన ఏమని చెప్పారు అంటే శరీరం చనిపోయిన తరువాత ఎవడైతే ప్రయాణం చేస్తున్నాడో వాడెంత నిజమో నువ్వు అనుకొనే లోకాలు కూడా అంతే నిజం అని చెప్పారు. ఇవన్నీ వ్యవహారిక సత్యాలు. భగవంతుడు తెలుసుకోమన్నది వ్యవహారిక సత్యాలను కాదు. ఏదైతే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో అంతటా వ్యాపించి ఉందో దాని తాలుక ఎరుక నీకు రావాలి. అప్పడు అంతట వ్యాపించి ఉన్నాను అన్న సంగతి నీకు తెలుస్తుంది, అప్పడు కమింగ్ లేదు, గోయింగ్ లేదు. ఎప్పడో కాదు, ఎక్కడో కాదు, ఇప్పడే ఇక్కడే ఈ జన్మలోనే ఆ స్థితిని పొందు, అక్కడకు నీ కళ్ళు తెరువు, వాయిదాలు వేయవద్దు. రేపుకు రూపు లేదు.

జరిగిపోయిన గొడవలు వద్దు. వర్తమానకాలాన్ని సాధనకు జాగ్రత్తగా ఉపయోగించుకో. ఈ రోజు చేసుకొనే పని ఈరోజే చేసుకోవాలి లేకపోతే దోషం వస్తుంది. ఏరోజుకారోజు రేపు రేపు అంటే సోమరితనానికి అలవాటు పడి అలా చెపుతారు. సోమరితనానికి అలవాటుపడినవాడికి ఏ పురుషార్థం లేదు. వాడికి ధర్మం లేదు, అర్థం

లేదు, కామం లేదు, మోక్షం లేదు, వాడు ఎందుకు పనికిరాడు. సృష్టి ఎప్పుడూ అలా జరుగుతూ ఉంటుంది. సృష్టిలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది, పుణ్యం ఉంటుంది, పాపం ఉంటుంది, రకరకాలుగా ఉంటుంది. దానిని పట్టించుకోవద్దు, మీరు వచ్చినపని చూసుకొని వెళ్ళిపోండి. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. అన్ని ఆకర్షణల మధ్యలో నిర్వికారంగా ఉండగలుగుతున్నామా లేక ఏదైనా ఆకర్షణకు గురి అవుతున్నామా అనేది చూసుకోవాలి. మన బలహీనతలు ఏమిటో లోకం చెపుతుంది అంతే, ఆ బలహీనతలను లోకం తియ్యదు. నువ్వు సాధనచేసి, గురువు అనుగ్రహాన్ని సంపాదించి ఆ బలహీనతల నుండి బయటకు రావాలి. సాధన చెయ్యటం అంటే ఏదో కొత్తగా సంపాదించటం కాదు. పూర్వజన్మల నుండి తెచ్చుకొన్న అలవాట్లలో నుండి విడుదల పొందటమే సాధన. ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖానికి వెళుతోందో ఆ కారణాన్ని తొలగించుకోవటమే సాధన యొక్క గమ్యం. రోగం వచ్చాక దానిని తగ్గించుకోవటంకంటే అసలు రోగం రాకుండా చూసుకోవటం మంచిది. కోరిక వచ్చాక దానిని నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చేయటంకంటే అసలు కోరిక రాకుండా చూసుకోవాలి. ఇతరులకు మంచి మాటలు చెప్పటం మంచిదే కాని దానికంటే టాప్‌మోస్ట్ ఇంపార్టెన్స్ సత్యాన్వేషణకు ఇవ్వాలి. నేను మీకు మంచి మాటలు చెప్పాను అనుకోండి. నాన్నగారు మీరు మంచి మాటలు చెప్పారు అంటే మాకు గర్వం వస్తుంది, అది మరల సత్యాన్వేషణను ఆపుచేస్తుంది. మీరు మంచిపనులు చేయటం మంచిదే. మీరు మంచి పనులు చేసారు అని ఎవరైనా పొగుడుతూ ఉంటే అప్పుడు మీకు వికారాలు ప్రారంభమవుతాయి, ఆ వికారాలు మీరు లోపలకు వెళ్ళకుండా ఆటంకపరుస్తాయి.

మీరు ధ్యానం చెయ్యండి, విచారణ చెయ్యండి, ఆ చేసే శక్తి మీకు లేదు అనుకోండి మనస్సును ముస్తాబు చెయ్యవద్దు అని భగవాన్ చెప్పారు. దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నారో దానిని డెకరేట్ చెయ్యవద్దు. కామక్రోధాలు చాలా లోతుగా ఉంటాయి. గోడలోనికి ఒక మేకును మనం చాలా లోతుగా కొట్టాము అనుకోండి, అది ఊరికే ఇలా లాగితే రాదు, ఎంత బలంగా మనం గోడలోకి కొట్టామో అంతబలంగా ఆ మేకును బయటకు లాగాలి. కామక్రోధములు ఎన్నో జన్మలనుండి మనలో లోతుగా పాతుకొనిపోయి ఉన్నాయి. కామక్రోధాల యొక్క లోతు ఎంత ఉందో, అంత గట్టిగా సాధన చేస్తేగాని కామక్రోధాల నుండి మనం విడుదల పొందలేము. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అన్నారు భగవాన్. ఆత్మలో దుఃఖం లేదు. దుఃఖం వచ్చినా, సంతోషం వచ్చినా దేహము నేను అనే బుద్ధికే వస్తుంది. దేహం ఉన్నప్పటికి కర్తృత్వం ఎవడికైతే నశించిందో వాడిని

దుఃఖం ముట్టుకోదు. కర్తృత్వం నశించినా వాడు ఉంటాడు, ఎలా ఉంటాడు అంటే ఆత్మగా ఉంటాడు. ఆత్మకు దుఃఖంతో సంబంధం లేదు. పుణ్యం చేసినా, పాపం చేసినా నేను చేసాను, నేను చేసాను అంటూ దేహగతమైన నేనుతో చేస్తాడు అందుచేత ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. కర్తృత్వం నశించింది అనుకోండి వాడికి ప్రారబ్ధం లేదు, ఆగామి లేదు, సంచితం లేదు. కర్తృత్వం పోయినతరువాత అన్నీ పోతాయి. వాడు ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని చూసేవాడికి అనిపిస్తుంది కాని అక్కడ ప్రారబ్ధం కూడా లేదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 06-03-08, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు మహాశివరాత్రి. ఈరోజున చాలామంది పగలు ఉపవాసం రాత్రి జాగరణ చేస్తారు. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే ఉండమని. ఈరోజున మనం పరమాత్మకు దగ్గరగా గడపాలి. రాత్రి జాగరణ చేసి శివుడిని ధ్యానం చేస్తూ శివస్మరణతో ఉండాలి. శివుడు జ్ఞానం ఇస్తాడని, విష్ణువు మోక్షం ఇస్తాడని మనపెద్దలు సాంప్రదాయంలో చెపుతారు. జ్ఞానం అన్నా మోక్షం అన్నా ఒక్కటే. ఈరోజుగడిచిపోతే చాలు అని మనం అనుకొంటాము. కాని మనకు దీర్ఘకాలిక చూపులేదు. అన్నికాలాలలో, అన్నిఅవస్థలలో ఏ వస్తువు అయితే ఉందో దానిని తెలుసుకొనేవరకు మనం సాధన చేయాలి. అప్పడు గాని మన ప్రయాణం ముగియదు. శివుడు అభిషేక ప్రియుడు, విష్ణువు అలంకార ప్రియుడు, సూర్యుడు నమస్కారప్రియుడు, సుబ్రహ్మణ్యుడు దర్శనప్రియుడు. వీరందరూ దేవతలు, అందరి దేవతల పట్ల మనం గౌరవంగా ఉండటం, పూజ్యభావంతో ఉండటం మంచిది. ఒకటి ఉంటే రెండు వస్తుంది, రెండు ఉంటే మూడువస్తుంది, మూడుంటే నాలుగు వస్తుంది. ఇంక అక్కడ ఆగదు. అసలు ఆ ఒక్కటీలేదు అన్నారు భగవాన్. ఇక్కడ ఒక్కటి అంటే అహంకారం, నేను అనేతలంపు. అది ఉంటే ఆదేవుడు అని, ఈదేవుడు అని స్వర్గం అనీ, నరకంఅనీ, పుణ్యంఅనీ, పాపం అనీ రైలుఇంజను వెనకాలపెట్లు వచ్చినట్లు అన్నీవచ్చేస్తాయి. అది లేకపోతే ఏదీ లేదు. మీరు చెప్పిన మాటలు మాకు నచ్చటంలేదు అని భగవాన్‌తో అంటే మీ అహంకారానికి ఎలా నచ్చుతాయి అన్నారు. సత్యాన్ని సమీపించటానికి అహంకారానికి ఇష్టం ఉండదు ఎందుచేతనంటే అక్కడికి చేరితే ఇదినశిస్తుంది.

మనం ఏదైతే నేను, నేనుఅంటున్నామో ఆనేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. ఈనేను అంటే మనకు ఇష్టం అందుచేత దానిని విడిచిపెట్టలేకపోతున్నాము, దానిగురించి విచారణ చేయటంలేదు. ఈనేను అనే తలంపు హృదయంయొక్కలోయలలో గాఢంగా

నాటుకొని పోయింది. ఇదే అనేక జన్మలకు కారణమవుతోంది. ఈ దేహం నాది, ఈ మనస్సు నాది, ఈ ఆస్థులు నావి అని ఇలా అనుకొంటున్నావు. నాది అనుకొనే ఈ దేహం గాని, మనస్సు గాని, అధికారం గాని ఇవిఏమి కూడా గాధనిద్రలో లేవు. నువ్వు జాగ్రదవస్థలో నాదినాది అని ఏదైతే అనుకొంటున్నావో గాఢనిద్రలో అవిఏమీ లేవు. ఏమీ లేకపోయినా నీవు ఉన్నావు. అక్కడ సంతోషంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు, నేనుఅనే తలంపు వచ్చాక మొత్తం గొడవ అంతా వచ్చేస్తోంది. అక్కడనుండి దుఃఖం, అశాంతి. మనం ఏదైనా మంత్రాన్ని జపం చేస్తుంటే మనస్సు అణుగుతుంది. మనస్సు నశించటంలేదు. అణిగిఉండటానికి , నశించటానికి మధ్యన ఉన్న భేదం సాధకుడికి, భక్తుడికి తెలియాలి. అణిగినమనస్సు మరల విజృంభిస్తుంది. మనస్సునశిస్తే తిరిగి విజృంభించే అవకాశంలేదు. అందుచేత మనోనాశనం అయ్యేవరకు మనస్సును నమ్మటానికి వీలులేదు. మనం తపస్సు చేసినా, జపంచేసినా మనలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికే. ఏవస్తువు అయితే మనలో అంతర్యామిగా ఉందో అది మనమై ఉన్నాము. అదే నేను అనే అనుభవం మనకు కలిగే వరకు మనిషి తపస్సు చేస్తూ ఉండవలసిందే. ఇంద్రియాలను జయిస్తేనే గాని మనస్సుకులోచూపు కలుగదు. మనలో స్వార్ధంలేదు అని అనుకొంటున్నాము గాని లోపలకు వెళ్ళి పరిశీలన చేస్తే ఎక్కడో అడుగును ఉంటుంది.

పని పనికోసం కాకుండా ఏదో ఒకటి ఆశించి నువ్వు పనిచేస్తూ ఉంటే అది తపస్సుకాదు. ఏమీ ఆశించకుండా, గౌరవం కూడా ఆశించకుండా పని పని కోసమే చేస్తే అది తపస్సు. అలా చేయటంవలన కూడా మనస్సు పల్చబడి చిరిగిపోతుంది. స్మశానంకు వెళ్ళేవరకూ మనం మనస్సుచుట్టూ , దేహం చుట్టూ, ఇంద్రియాల చుట్టూ కోరికలచుట్టూ తిరుగుతూ ఉంటాము. ఏదైనా ఒకమాట మాట్లాడినా, ఒక పని చేసినా వాడి స్వార్ధంకోసం చేస్తాడు. దేవుడు ఉన్నాడని, దేవుడు లేడు అని వాదిస్తూ ఉంటాడు. దేవుడు మీద తీర్పులు చెపుతూ ఉంటాడు. దేహ బుద్ధి ఉన్నపుడు చైతన్యం గురించి తీర్పులు చెప్పటం ఎలా ఉంటుంది అంటే కిరసనాయిలు దీపం సూర్యుడి గురించి జడ్జిమెంట్ చెప్పినట్లుగా ఉంటుంది. కిరసనాయిలు దీపం ఎక్కడ, సూర్యుడు ఎక్కడ. మీరు సబ్జక్టు బాగా అర్ధం చేసుకోండి, సబ్జక్టు కూడా వచ్చేయండి, డీవియేషన్ వద్దు. మనం ఒక శవాన్ని వేసుకొని ఎలా తిరుగుతున్నామో, ఇంకా ఇటువంటి శవాలు ఈ ప్రపంచంలో కొన్నికోట్లు ఉన్నాయి. తన ఇష్టానుసారం నడవటానికి ఇందులో ఒక్క శవానికి కూడా ఫ్రీడం లేదు. కాని నాకు ఫ్రీడమ్ ఉంది అని ఆ శవం అనుకొంటుంది. ఈ శవాల యొక్క హృదయంలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. ఆయన పని చేస్తున్నాడు. ఆయన చేసే పని మన ఇంద్రియాలకు

అందదు. ఈ దేహం స్మశానంకు వెళ్ళేవరకు ఆ దేహప్రారబ్ధాన్ని అనుసరించి దానిని తిప్పతూ ఉంటాడు. లోపలఉన్న ఈశ్వరుడు ఈ శవాలను నడుపుతూ ఉంటాడు, ఆ ప్రకారం నడపవలసిందే గాని ఒక్క చిన్నపని చేయటానికి కూడా ఏ ఒక్క శవానికి ఫ్రీడమ్ లేదు. ఈ శవాలు అన్నీ ఆయన చేతిలో ఉన్నాయి. పలికే వాడిని నేను అయినా పలికించేవాడు ఆయనే, ఆడేవాడిని నేనైనా ఆడించేవాడు ఆయనే అందుచేత ఈశ్వరుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అని ముందు మనకు గుర్తింపు రావాలి.

దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి నువ్వు పనిచేస్తూ ఉంటే నీకు జ్ఞానం కలుగుతుంది అని చెప్పారు. ఏ దేహమైతే ప్రారబ్ధం అనుభవిస్తోందో ఆ దేహంతోటి తాదాత్మ్యం కనుక పోతే దేహము నేను అనే తలంపును పోగొట్టుకొంటే నీవు జీవన్ముక్తుడవు అవుతావు. మీరు మంచిప్రారబ్ధంతోటి కలువకూడదు, చెడుప్రారబ్ధంతోటి కలువకూడదు, అది అనుభవిస్తే పోతుంది. మనకు స్వప్నం వచ్చింది అనుకోండి. అది మంచి స్వప్నం అయినా, చెడు స్వప్నం అయినా మెలుకువ వచ్చాక అబ్బే ఏమీ లేదు అనుకొంటాము. మంచి స్వప్నం ఎంత అసత్యమో, చెడుస్వప్నం కూడా అంతే అసత్యం. మీ రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నా అదీ స్వప్నమే, మీ జీవితం కష్టాలతో వెలుతున్నా అదీ స్వప్నమే. దేహప్రారబ్ధాన్ని బట్టి అన్నీ వస్తూ ఉంటాయి, వాటితో తాదాత్మ్యం పొందవద్దు. మనం బాగుపడాలంటే ఇతరులతో పోల్చుకోకూడదు. మనం మనంగా జీవిస్తూ, దేహాన్ని, మాటను, మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ సాధన చేస్తూ ఉంటే మనం తరిస్తాము లేకపోతే సున్నా. మీకు ఏదైనా మంచి పని చేయాలని ఉంటే చేయండి అంతేగాని ఇతరులు మెచ్చుకొంటారు అని చేస్తే మీకు దేహాభిమానం పెరిగిపోతుంది. మీకు వేలకోట్ల డబ్బు ఉన్నా దేహాభిమానం ఉన్న వాడిని దుఃఖం విడిచిపెట్టదు. మనకు ఉన్నది బ్రహ్మజ్ఞానం కాదు. ఉపాధి జ్ఞానం. ఉపాధి జ్ఞానంలోనుండి మళ్ళించబడి వాడికి బ్రహ్మజ్ఞానం కలిగేవరకూ ఏ జీవుడిని సంసారం విడిచిపెట్టదు. ఉపాధిజ్ఞానం ఊడగొట్టుకొన్నాక మీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. బ్రహ్మజ్ఞానం కలిగాక ఆ బ్రహ్మమే జీవకోటిగా, జగత్తుగా, పంచభూతాలుగా కనిపిస్తోంది, ఇన్ని రూపాలుగా కనిపించేది బ్రహ్మమే, ఉన్నది బ్రహ్మం ఒక్కటే అని వాడికి తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానం కలిగినవాడికి ఆ వన్‌నెస్ తెలుస్తుంది గాని మిగతావారికి సాధ్యం కాదు.

జీవితంలో నీకు ఎటువంటి సంఘటనలు ఎదురైనా, నీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా వాటిని సమానంగా భరిస్తూ ఉంటే వాడికి లోచూపు కలుగుతుంది. ఆత్మను దేహం అనుకోవద్దు, ఆత్మను మనస్సు అనుకోవద్దు. ఆత్మను దేహం అనుకొంటావు అనుకో నేను

చనిపోతున్నాను అనుకొంటావు. ఆత్మను మనస్సు అనుకొంటావు అనుకో నాకు దుఃఖం వస్తోంది అంటావు. ఉన్న వస్తువు మీద నువ్వు దేహాన్ని ఆరోపించుకోవటం వలన నువ్వు చనిపోతున్నాను అనుకొంటున్నావు, మనస్సును ఆరోపించుకోవటం వలన ఏదో దుఃఖంగా ఉంది, అశాంతిగా ఉంది అనుకొంటున్నావు. పెంట అంతా మనస్సులోనే ఉంది. మనం ప్రజలను చూసేటప్పుడు అతి దయగా ఉండకూడదు, క్రూరత్వంగానీ ఉండకూడదు. ప్రజల పట్ల దయ చూపటం మంచిదే అంతకంటే ఆత్మవిచారణ మంచిది. దయ చూపించటం అనేది మామూలు ధర్మం. నీకు ఆత్మవిచారణ కుదురుతోంది అనుకో, నీవు ఆత్మాన్వేషణలో ఉన్నావు అనుకో, భగవంతుడిని తెలుసుకోవటానికి మామూలు ధర్మాలు వదిలేసినా పాపం రాదు. బుద్ధుడు ఇల్లు విడిచిపెట్టినప్పుడు భార్యమీద దయకలిగినా, తండ్రిమీద దయకలిగినా గృహపరిత్యాగం చేయలేడు. మీరు మంచి చేయటం మంచిదే కాని ఆత్మాన్వేషణకు అది మీకు అడ్డురాకూడదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, వాడిని తెలుసుకోవటం కంటే నీకు ముఖ్యమైన పనులు ఏమి ఉన్నాయి. సత్యాన్వేషణ వదిలేసి ఆ యజ్ఞాలు చేయండి మీకు కోరికలు నెరవేరతాయి అని చెపుతావు ఏమిటి? మనకు భగవంతుడి కంటే భగవంతుడు కల్పించిన వస్తువులు అంటేనే ఎక్కువ ఇష్టం.

ఈ లోకం దుఃఖాలమయం, అనిత్యం, అశాశ్వతం, అసుఖం అని పరమాత్మ గీతలో చెప్పాడు. శ్రీకృష్ణ చైతన్య ఇంతకంటే అందంగా చెప్పాడు. ఈ లోకం ఒక పాములాంటిది. దానిని ముట్టుకుంటే మెత్తగా ఉంటుంది, కాని దాని నోటినిండా విషం ఉంటుంది. ఈలోకం కూడా అంతే లోకం నిండా విషం తప్పించి ఏమీలేదు. ఈ లోకాన్ని మీరు నాకేసుకొంటున్నారు, ఇలా ఎంతకాలం ఈ లోకాన్ని నాకుతారు. ఎవరికైనా మీ మీద కోపం వస్తోంది అనుకోండి. ఏమిటి నామీద కోపంగా ఉంటున్నారు అని అనుకోనక్కరలేదు. అది లోకం యొక్క తీరు అనుకొంటే ఏమీలేదు. అకారణంగా ఎవరైనా మిమ్మల్ని ద్వేషిస్తున్నారు అనుకోండి. ఏమిటి నేను ఏమీ చేయలేదు కదా, ఇలా ఎందుకు ద్వేషిస్తున్నారు అని ఆలోచించి మీ తలకాయ పాడు చేసుకోవద్దు, అది ప్రపంచం యొక్క పోకడ. ఇన్ని వికారాల మధ్యన నువ్వు నిర్వికారంగా ఉండగలిగితే ఈశ్వరానుగ్రహం నీ మీద వర్షిస్తుంది, ఈశ్వరుడు తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. ఉన్నదేదో ఉంది. ఆ ఉన్నదానిని నీవు అనుభవైకవేద్యం చేసుకోవటానికి ఏ విషయాలు అయితే నీకు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన లేకపోతే నీకు సాధనతో పనిలేదు. మనం ఏదైతే కాదో అదే మనం అనుకొంటున్నాము. ఆ రాంగ్ థింకింగ్‌లో నుండి బయటకు రావటానికే సాధన. తైత్తిరీయోపనిషత్‌లో ఏమని చెప్పారు అంటే నువ్వు అన్నం తిను. అన్నం

బ్రహ్మమై ఉన్నది, గరిటె బ్రహ్మమై ఉన్నది, వండేవాడు బ్రహ్మం, తినేవాడు బ్రహ్మం, వంట బ్రహ్మం, అంతా బ్రహ్మమే. నువ్వు అసలు లేవు. నువ్వు ఉన్నానని అనుకోవటం ఒక భ్రాంతి. ఆ భ్రాంతిలో నుండి బయట పడేవరకు హృదయంలో ఉన్న నిజం నీకు గోచరం కాదు. నేను, నాది అనే తలంపులనుండి ఎవడైతే విడుదల పొందాడో వాడి ద్వారా ఆ బ్రహ్మం వ్యక్తమవుతుంది. వారినే భగవంతుడు టీచర్స్‌గా ఉపయోగించుకొంటాడు.

తిండికీ బ్రహ్మానికి సంబంధం ఏమిటి అని మీరు అనుకోవద్దు. నోటితో తినేదే తిండి అనుకోవద్దు, చెవులతో వినేది, కళ్ళతో చూసేది కూడా ఆహారమే. నోటితో తినే తిండి రుచి కోసం కాకుండా ఈ దేహం నిలబడటం కోసం తినండి. బ్రహ్మజ్ఞానం పొందటానికి అనుకూలమైన మాటలే వినండి, అటువంటి దృశ్యాలే చూడండి. అస్తమాను లోకం గొడవలు వింటూ, లోకం గొడవలు చూస్తూ ఉంటే ఆ రకమైన తిండి బ్రహ్మజ్ఞానం సంపాదించటానికి పనికిరాదు. అందుకే రైటెఫుడ్, రైట్‌తింకింగ్, రైటస్పీచ్, రైట్‌యాక్షన్ అవసరము. ఇవన్నీ దేనికి అంటే ఇవి బ్రహ్మానుభవం పొందటానికి మీకు సహకరిస్తాయి. నేను అనే తలంపు ఒక తప్పు. నాది అనే తలంపు ఒక తప్పు. ఈ రెండు తప్పులనుండి నువ్వు విడుదల పొందలేవు అనుకో నీకు శాంతిలేదు, శాంతిలేనివాడికి సుఖం లేదు. నేను ఉన్నాను అనుకొంటున్నావు. నువ్వు ఉంటే నువ్వు చేసే కర్మలకు ఫలితం ఇచ్చే దేవుడు ఉన్నాడు. నువ్వు ఉంటే వాడు కూడా ఉన్నాడు. నీదొక వేషం, వాడిది ఒక వేషం. నీ వేషం నీవు తీసేసిన వెంటనే ఆయన వేషం ఆయన కూడా తీసేస్తాడు. అప్పుడు ఒక్కటి అంటే ఒక్కటే. స్వార్థం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము అని పరమాత్మ చెప్పాడు. లోపల స్వార్థం పెట్టుకొని, స్వార్థం లేకుండా పనులు చేస్తున్నాము అని చెప్పినా, అంతర్యామిని మనం మోసం చేయలేము. స్వార్థం ఉన్నంతకాలం, ఈ నేను అనే తలంపు ఉన్నంతకాలం మనం లోపల ఖాళీ అవ్వము, లోకానికి సంబంధించిన పెంట అంతా లోపల కుక్కేసుకొంటాము, ఇది అనేక నీచ జన్మలకు కారణం అవుతుంది. నీకు ఆధ్యాత్మిక బలం పెరగాలి అంటే నువ్వు మాట్లాడేమాట వలనగాని, చేసే పనులవలనగాని, వచ్చే తలంపుల వలనగాని నీకు దేహాభిమానం తగ్గుతోందా లేదా అనేది చూసుకోవాలి. దేహాభిమానం లేని వాడికి ఎక్కడ చూసినా సుఖమే, ఎక్కడ చూసినా శాంతే. తన శరీరం తాలుక మరణాన్ని తన మరణమే అనుకొని ఆ మృత్యువును ఎవడైతే చూస్తున్నాడో వాడు అజ్ఞానంలో నుండి, బంధంలో నుండి విడుదలపొందలేడు. మృత్యువును చూసేవాడికి చివరకు మృత్యువే గతి.

నీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పడు పొంగిపోకుండా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పడు కృంగిపోకుండా సమానంగా ఉండ గలిగితే అదే నిజమైన తపస్సు. మన అస్తిత్వం

ఈ దేహానికే పరిమితమై ఉన్నంతకాలం, మన ఆలోచనలు తలంపులు దేహం చుట్టూ, మనస్సు చుట్టూ తిరుగుతున్నంతకాలం మనకు స్పష్టతరాదు, నీకు శాంతిలేదు. మనం పనిచేస్తూ పనిలో నుండి బయటకు రావాలి, పని లేని స్థితిని పొందాలి కాని పని మానివేసి పనిలేని స్థితికి రాలేరు. బ్రాహ్మీస్థితిని పొందినవాడు కర్మను విడిచిపెట్టడు, కర్మే వాడిని విడిచి పెడుతుంది. పనిమానివేయటం వలన పనిని జయించలేము పని చేస్తూ చేస్తూ పనిలోనుండి బయటపడాలి. మనకు డబ్బు అంటే ఇష్టం, జ్ఞానం కావాలి అనుకొంటున్నాము. ఇది పరస్పర విరుద్ధం. ఏదైతే లక్ష్యమో అక్కడ మనస్సు లేదు. ఎందుచేత జ్ఞానం అబద్ధం అనుకొంటున్నాము, డబ్బు నిజం అనుకొంటున్నాము. సూది బెజ్జంలోనుండి ఒంటెను బయటకు లాగవచ్చు కాని ధనవంతుడిని స్వర్గరాజ్యంలోనికి పంపలేము అని ఏసు చెప్పాడు. ఎందుచేతనంటే వాడికి ధనచింతన తప్పించి దైవచింతన ఉండదు. ఈశ్వరుడు పనిచేస్తున్నాడు, ప్రారబ్ధము ననుసరించి మనలను ఆడిస్తున్నాడు. ఇది నీవు గుర్తించటం కావాలి, అప్పుడు మీకు దుఃఖం నశిస్తుంది. అది బాగానే సాధించాము, ఇది చేయలేకపోయాము అని కొంతమంది అంటూ ఉంటారు. ఇక్కడ ఫెయిల్ అవ్వటం అక్కడ సాధించటం రెండూ ఈశ్వర సంకల్పమే, అది వాడికి తెలియటం లేదు. సాధించటానికి, సాధించలేకపోవటానికి అసలు నువ్వంటూ ఒకడవు ఉన్నావా? వాడు ఎవడు సాధించటానికి, అవి అన్నీ అజ్ఞానంలో నుండి వచ్చే మాటలు. సాధన ఎప్పటివరకు చెయ్యాలి? ఎవడి సంకల్పం ప్రకారం మన జీవితయాత్ర నడుస్తోందో వాడే నేను అనే అనుభవం వచ్చేవరకు ఎవడూ సాధన విడిచిపెట్టకూడదు.

సబ్జక్టు నుండి తప్పించి, ఈ పూజ చేయండి ఈ కోరిక నెరవేరుతుంది అంటే మీరు ఇష్టపడుతున్నారు. అజ్ఞానాన్ని తొలగించుకోవటంమీదే గురిపెట్టి సబ్జక్టు చెపుతూ ఉంటే మీకు అంత ఇష్టం ఉండదు. ఈ యజ్ఞం చేయండి చనిపోయిన తరువాత స్వర్గలోకానికి వెళ్ళవచ్చు, భోగాలు అనుభవించవచ్చు అని చెపితే బాగానే ఉంటుంది. ఇప్పుడు ఏదో చేసుకోండి, అప్పుడు ఏదో వస్తుంది అని చెప్పటంకాదు. ఇప్పుడే తేలిపోవాలి. మనలో అంతర్యామిగా ఉండి ఎవడైతే మనలను ఆడిస్తున్నాడో వాడే నేను అనే అనుభవం వచ్చేవరకు సాధన చేయవలసిందే, గురువును ఆశ్రయించవలసిందే. సబ్జక్టు బాగా అర్థమవుతూ ఉంటే ఏదో బాహ్యసామ్రాజ్యానికి కాదు, శాంతిసామ్రాజ్యానికి ఇప్పడే ఇక్కడే అధిపతివి అవుతావు. అలెగ్జాండర్ చక్రవర్తి చాలా దేశాలను జయించాడు. ఆయన చివరి టైములో ఏమనిచెప్పాడు అంటే శవాన్ని తీసుకొని వెళ్ళేటప్పడు పెట్టెను పూర్తిగా మూసేయవద్దు రెండు ప్రక్కల రంధ్రాలు చేసి చేతులు బయటకు వేలాడేటట్లు ఉంచండి అని చెప్పాడు. పెట్టె మొత్తం

మూసేయాలి, చేతులు బయటకు వేలాడటం ఎందుకు అంటే అలెగ్జాండర్‌లాంటి మహాచక్రవర్తి వల్లకాటికి వట్టి చేతులతో వెళ్ళిపోతున్నాడు అని లోకానికి తెలియటానికి అని చెప్పాడు. మనకు ధనం ఉంది అనుకోండి, ధనంతో తాదాత్మ్యం చెందితే గర్వం వస్తుంది. ధనం ఉండగా నువ్వు పోవచ్చు లేకపోతే నువ్వు ఉండగా ఆ ధనం పోతుంది. అది వేరే విషయం. ఆ ధనం నాది నాది అనుకోవటం వలన వచ్చిన గర్వం మటుకు ఆత్మజ్ఞాన సముపార్జనకు అవరోధంగా ఏర్పడుతుంది. ఈ గర్వం పోగొట్టుకోవటానికి మరల పది జన్మలు పట్టవచ్చు.

మన పురాణాలలో ఒక కథ చెపుతారు. రుక్మిణీదేవి మురళిని అడిగిందట. కృష్ణుడి నోటిలో మురళి ఉంటుంది. భగవంతుడికి నాకంటే నువ్వు అంటేనే ఇష్టంగా ఉంది. నన్ను దూరంగా ఉంచుతున్నాడు, నిన్ను కూడా పట్టుకొనిపోతున్నాడు పైగా ఎప్పుడూ నోటిలో ఉంటావు. నీమీద ఉన్న ప్రేమ నామీద కనబడటం లేదు అని మురళిని అడిగిందట. అప్పుడు మురళి ఏమని చెప్పింది అంటే నాలోపల ఏమి ఉందో చూడు నేను ఖాళీ అయిపోయాను పూర్తిగా అందుచేత ఆయన పట్టుకొన్నాడు. అలాగే ఎవడైతే నేను, నాది అనే తలంపులు శేషం లేకుండా ఖాళీ అయిపోతాడో వాడిని భగవంతుడు పట్టుకొంటాడు. నన్ను అందుకే పట్టుకొన్నాడు కాని నా మీద ఇష్టంకాదు, నీమీద కోపంకాదు అని మురళి చెప్పింది. ఎవడైతే తనను తాను వదులుకొంటాడో వాడిని ఈశ్వరుడు పట్టుకొంటాడు. ఎవడైతే తనను తాను వదులుకోడో వాడు ఎన్ని తపస్సులు చేసినా అవి ఒకటిలేని సున్నలు. కొంతమంది ఎంతసేపు దేహాభిమానాన్ని పెంచుకొనే మాటలు మాట్లాడతారు. ఆ మాటలు మామూలుగా మనకు వినటానికి బాగానే ఉంటాయి కాని వాడు లోపల కుళ్ళిపోతూ ఉంటాడు. మనలను మనం ఖాళీ చేసుకోవటం లేదు, పోగుచేసుకొంటున్నాము మీరు ప్రశాంతంగా కూర్చొని మీ మనస్సులో ఏముందో చూసుకోండి. మీ మనస్సులో డస్టు తప్పించి ఏమీలేదు. మన ఇంట్లో బంగారం ఉన్నా, మన మనస్సు బంగారం కాకపోతే దానికి మెచ్యూరిటీ రాదు. మట్టి, రాయి, బంగారం ఈ మూడు మన కంటికి ఒకేలాగ కనబడాలి, అప్పుడు వాడికి మెచ్యూరిటీ వచ్చినట్లు అని చెప్పారు.

కంపేరిజన్ వలన నీకు దుఃఖం వస్తుంది. నీకు ఒక ఎకరం ఉంది అనుకో, పది ఎకరాలు ఉన్న వాడితో పోల్చుకొంటే నీకు దుఃఖం వస్తుంది. అందుచేత ఇతరుల గొడవవద్దు, కంపేరిజన్ వద్దు, నీ గొడవ ఏదో నువ్వు చూసుకో. ఈ లోకంలో కనిపించేది ఏదీ నీది కాదు. ఎవడైతే యజమానో వాడిదే ఈ సొత్తు అంతా. నీ ప్రారబ్ధాన్ని బట్టి నీకు ఎంత ఇవ్వాలో అంత పడేస్తాడు. ఆ డబ్బు ఆయనదే కాని నాది నాది అని ఊరేగుతూ ఉంటావు. నువ్వు ఆశపడినా ఎక్కువ ఇవ్వడు. నీకు డబ్బు గొడవ లేకపోయినా నీ వాటా నీకు పడేస్తాడు, వాడే ఈశ్వరుడు.

అలవాట్ల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. కొన్ని అలవాట్లు జిడ్డులాంటివి. కొన్నిరకాల జిడ్లు ఎన్నిసార్లు తోమినా అవి అలాగే ఉంటాయి. కొన్ని అలవాట్లు నువ్వు శారీరకంగా వాటిలో నుండి బయటకు వచ్చినా ఆ వాసన నిన్ను విడిచిపెట్టదు. పెద్ద పెద్ద ఆశ్రమాలలో ఉంటూ మేము తపస్సులు చేస్తున్నాము, జపాలు చేస్తున్నాము అని చెప్పేవారు కూడా మనం వెళ్లి వారి దగ్గర కూర్చొంటే ఏవో ఇంటి దగ్గర గొడవలు చెపుతూ ఉంటారు, ఇంక దేనికి ఆశ్రమాలకు వెళ్ళటం, అదే మాయ. నిశ్చలంగా ఉండు, నిర్మలంగా ఉండు, కూల్‌గా ఉండు, అప్పడు భగవంతుడు నువ్వు వేరు కాదని నీకు తెలుస్తుంది అంటాడు బైబిల్‌లో. మనస్సును మచ్చిక చేసుకో, దానిని రెచ్చగొట్టకు, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటే మనస్సు పెరిగిపోతుంది. మనస్సు ఎక్కడ నుండి అయితే వస్తోందో అక్కడ నువ్వు ఉండగలిగితే నిశ్చలంగా ఉంటావు, నిర్మలంగా ఉంటావు, కూల్‌గా ఉంటావు, అప్పడు భగవంతుడికంటే నువ్వు వేరుగా లేవు అన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది, అది నీ కడసారి జన్మ.

మీరు ఏదైతేకాదో ఆ గొడవలలోనికి వెళ్ళవద్దు. మీరు ఏదైతే అవునో దానిని పట్టుకోండి. అప్పడు మీరు కానిదంతా మిమ్మల్ని వదిలివెళ్లిపోతుంది. మనస్సు ఎక్కడ నుండి వస్తోందో చూడండి. పాము ఏ కలుగులోనుండి వస్తోందో చూడండి. మీరు ఆ కలుగు దగ్గరే ఉండండి. పాము నెమ్మదిగా బయటకు వస్తుంది మిమ్మల్ని చూసి మరల లోపలకు వెళ్లిపోతుంది. మరల బయటకు వస్తుంది, మిమ్మల్ని చుసేటప్పటికి లోపలకు వెళ్లిపోతుంది. అలాగే మీరు మనస్సు ఎక్కడ పుడుతూ ఉంటే అక్కడే చూడండి. మీరు వాచ్ చేస్తూ ఉంటే అది లోపలకు వెళ్లిపోతుంది. మీరు దానితో గొడవ పెట్టుకోవద్దు. అది ఎక్కడ నుండి వస్తోందో అక్కడే ఉండండి. అది బయటకు వచ్చినా మరల లోపలకు వెళ్లిపోతుంది. ఇక్కడ పోరాటం లేదు. దీనినే చంపకుండా చంపటం అంటారు. ఒక ఇంగ్లీషు రచయిత ఏమి చెప్పాడు అంటే ఒకడు బొమ్మలు వేసాడు. ఆ బొమ్మలు వేసినవాడిని ఇలాగ ఎందుకు వేసావు అలాగ ఎందుకువేసావు అని వాడిమీద ఆ బొమ్మలు ఎదురుతిరిగినా ఏమీ చేయలేవు. అలాగే మనం అందరం బొమ్మలం. ఈ బొమ్మలను వేసినవాడు ఈశ్వరుడు. వాడితోటి కాంప్రమైజ్ అవ్వటం మానేసి వాడితో పేచీలు పెట్టుకొని మనం ఏమీ చేయలేము. వాడితో ఫైట్ చేసినా ఇంక ఆ బొమ్మ మారదు. అలాగే మనం ఈశ్వరుడితో ఫైట్ చేసినా ప్రయోజనం సున్నా. వాడికి ఆ బొమ్మమీద అయిష్టం, ఇష్టం ఏమీ ఉండదు, ఈ బొమ్మలు అన్నీ స్మశానంలో కాలవలసిందే. మధ్యన ఏమీ చేయలేము. అందుచేత ఆయన సంకల్పాన్ని అంగీకరించండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూన్ | 8 | మహేంద్రవాడ, మండపేటకు 12 కి.మీ.లు (వయా) మాచవరం |
| జూన్ | 12 | వేండ్ర శివాలయం |
| జూన్ | 16 నుండి 26 వరకు అరుణాచలం క్యాంపు | |
| జూలై | 6 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జూలై | 18 | గురుపౌర్ణమి హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, సత్యసాయి నిగం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# శ్రీ రమణ స్మరణ

1. అవిద్యకు బద్ధ శత్రువు, పరమ సత్యానికి మిత్రుడు, ముముక్షువులకు స్ఫూర్తి।
   ఆత్మ జ్ఞానానికి నిలువెత్తు నిదర్శనం, అతడే భగవాన్ శ్రీ రమణ మహర్షి॥

2. సకల జీవ సమత్వమే అతని మార్గం, స్వరూప ఎరుకే శ్రీ రమణుని ఆయుధం।
   ఆరోపిత బంధ విముక్తే అతని లక్ష్యం, సహజత్వమే శ్రీరమణుని కిష్టం॥

3. అహంకారాన్ని నిరసించి, మనస్సును జయించి, ఋషియైనాడు।
   ఆత్మగా జీవించి చూపించాడు, ఆత్మ విద్యే మేలని బోధించాడు॥

4. కేవలం ఉన్న అద్వయ బ్రహ్మమే 'నీవు' అన్నది శ్రీరమణుని హితోపదేశం।
   ఏ భేదభావన లేని సకల జీవ సౌభ్రాతృత్వం శ్రీ రమణుని అభిమతం॥

5. అనవరతం భగవాన్ శ్రీరమణుని స్మరిద్దాం, అతని బోధను అనుసరిద్దాం।
   ఆత్మజ్ఞానంతో అవనికే ఆదర్శంగా నిలుద్దాం, బ్రహ్మమై వెలుగుదాం॥

**చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# నిజంలో ఉండటం నేర్చుకొంటే - నిజం తెలుస్తుంది

నిజం అంటే సర్వ కాల సర్వ అవస్థలలోను మార్పు లేక సమానంగా ఉండే ఆత్మ ఈ సృష్టి అంతా దాని వెలుగులోనే మనుగడ సాగిస్తున్నది. శరీరం "నేను" అనేది అత్యంత పనికి మాలిన విషయం. ఇది కేవలం సమస్యలను సృష్టిస్తుంది. మనస్సు అనేది కేవలం ఇతరులతో ఉండటానికి ఉపయోగపడే పరికరం, అది ఆత్మానుభవానికి సహాయపడదు. మనస్సు ఇతరుల కొరకు, ధ్యానం మన కొరకు. మనస్సు పరుగెడుతూ ఉంటుంది. అస్థిత్వం కూర్చుంటుంది. కదులుతూ ఉన్న ఎడ్ల బండిలో చక్రాలు కదులుతూ ఉంటాయి. ఇరుసు నిశ్చలంగా ఉంటుంది. మన ఆత్మ అనంతమైనది కదలనిది, మనస్సు శరీరాలు కదిలేటటువంటివి ఎన్నో జన్మల నుంచి అస్తవ్యస్తమైన పనులు చేస్తూ, ఎన్నో అవాంతరాల సృష్టికి ప్రయత్నించామ దానిని నిర్మూలనకు కొంత సమయం పడుతుంది. అనుకరించటం తెలిక అర్థం చేసుకోవటం కష్టం. ఒక్కసారి అవగాహన చేసుకొంటే అదే విడిపోతుంది అప్పడే మనం ప్రేమలో జీవిస్తాము. అప్పడు ఏ భారమూ లేని పసివానిలా బంధరహితంగా ఉంటాము. జన్మించటానికి ప్రయత్నించామా? ఎదగటానికి, గాలి పీల్చుకోవటానికి ప్రయత్నిస్తున్నామా? దాని మానాన్ని అది జరుగుతున్నది అలాగే ప్రారబ్ధానుసారం జరిగే దానికి ప్రతిఘటన వద్దు. ఆ ప్రవాహం ఎక్కడికి తీసుకొని వెడితే అక్కడికి తేలుతూ వెళ్ళాలి. ఆకాశంలో మబ్బులా కాని సాధకునకు, సాధనకు స్వేచ్ఛ ఉంది. శ్రీనాన్నగారు "ప్రతిఘటన వద్దు, ప్రకోపం వద్దు, క్రియేషన్ను ప్రశాంతంగా చూడు క్రియేటరు దగ్గరకు వెళ్ళిపోతావు" అన్నారు. మనం ఏమీ చెయ్యనక్కరలేదు, చూస్తూ కూర్చుంటే చాలు (ఊరక ఉంటే చాలు) మనస్సును ఒప్పించాలంటే మనం తార్కికంగా ఉండాలి లేదా దాని షరతులకు లొంగి పోవలసి వస్తుంది. మనం బయటకు వెళ్ళినప్పడు చెప్పలు వాడతాము, ఇంటికి వచ్చినప్పడు బయట వదులుతాము. అక్కడ ఏ సంఘర్షణా లేదు. సమాజంలోకి వెళ్ళటానికి మనస్సు కావాలి, హృదయంలో ఉండటం నేర్చుకొంటున్నప్పడు దానితో పనిలేదు. దీపానికి ప్రకాశం చెయ్యటం తప్ప వేరే పని లేదు. మనం నిజం తెలుసుకోవటం మించిన మరో పని లేదు. మన ఈ ప్రయత్నమంతా అనంత శక్తి స్వరూపుడైన గురువు యొక్క అభయ హస్త నీడలోనే సఫలమౌతుంది అని నమ్మాలి, ఆయనను కొలవాలి అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**